క్లుప్తంగా

పోలింగ్ స్టేషన్‌లో మార్పులు

బూర్గంపాడు: మండలంలోని మొరంపల్లిబంజర్ గ్రామంలోని 237వ నంబర్ పోలింగ్ స్టేషన్‌లో వేపలగడ్డకు చెందిన సుమారు 852 ఓటర్లను గిరిజన ప్రైమరీ స్కూల్, వేపలగడ్డ పోలింగ్ స్టేషన్‌కు మార్చినట్లు బూర్గంపాడు తహసీల్దార్ ముజాహిద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇక నుంచి వేపలగడ్డ లో ఉన్నటువంటి ఓటర్లు తమ ఓట్లను అక్కడే వినియోగించుకోవచ్చని తెలిపారు. అలాగే 227వ నంబర్ పోలింగ్ స్టేషన్ పేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలగా సరిచేశామని, ఇక నుంచి ఎంపీపీఎస్, బూర్గంపాడుగా ఉండదని తెలిపారు.

వైభవంగా వసంతోత్సవం

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం వైభవంగా వసంతోత్సవం జరిపారు. స్వామి వారిని పురవీధుల గుండా ఊరేగిస్తూ గ్రామంలోని ప్రజలు, ఆలయ సిబ్బంది రంగులు చల్లుకుంటూ వసంతోత్సవం జరుపుకున్నారు. ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన

మణుగూరురూరల్: మండల పరిధిలోని అన్ని ఆరోగ్య ఉపకేంద్రాల్లో, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం పిల్లల్లో క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వైద్యసిబ్బంది పిల్లల తల్లిదండ్రులకు క్షయవ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. వైద్యసిబ్బంది రాంప్రసాద్, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రోజు కూలి రూ.264

అశ్వాపురం: మండలంలోని ఉపాధి హామీ కూలీలు సోమవారం ఒక్కో కూలీ రూ.264 వచ్చేలా పనులు చేశారు. కూలీలు ఇంకా 30 నిమిషాలు పని చేస్తే రోజుకు రూ.300 చేరుకునే అవకాశం ఉంది. ఈ నెలలో మండలంలోని ఉపాధి కూలీలు సగటున రోజుకు రూ.264 పని చేస్తూ 87.95 శాతంతో జిల్లాలోనే అశ్వాపురం మండలం రెండో స్థానంలో ఉంది. ఉపాధి కూలీలు పూర్తి స్థాయిలో పని చేస్తే రూ.300 చెల్లిస్తారు. ప్రతి రోజు కూలీలు రూ.264 వచ్చేలా మార్కింగ్ ఇస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లను, ఎంబీ రికార్డు చేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లను, ఉపాధి హామీ సిబ్బందిని ఎంపీడీఓ వరప్రసాద్ అభినందించారు.

పని వేళలు మార్చాలి

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో తీవ్రమైన ఎండల కారణంగా కార్మికులు పడుతున్న ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని షిఫ్ట్ టైమింగ్స్ మార్చాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పీవీకాలనీలోని కార్యాలయంలో బ్రాంచ్ సెక్రటరీ మేకల ఈశ్వర్ మాట్లాడుతూ.. ఆరెంజ్ అలర్ట్ కొనసాగుతున్న నేపథ్యంలో షిఫ్ట్ సమయాల్లో మార్పులు చేయాలని, ఎండ తీవ్రత తగలకుండా పటిష్టమైన రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. జాయింట్ సెక్రటరీ పుల్లారావు, ఆఫీస్ బేరర్స్ ఆదరణ సురేందర్, ఆవుల నాగరాజు, ఫిట్ సెక్రటరీ శరత్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ బొక్క శ్రీనివాస్ ఉన్నారు.

నిర్మాణాన్ని కొనసాగించాలి

అన్నపురెడ్డిపల్లి: మండల పరిధిలోని పెద్దిరెడ్డిగూడెం పంచాయతీలో ముక్కెర బజారులో సీసీ రోడ్డు నిర్మాణాన్ని కొనసాగించాలని కోరుతూ రజక వృత్తిదారుల సంఘం అధ్యక్షురాలు సాలికోళ్ల శివకుమారి ఆధ్వర్యంలో ఎంపీడీఓ మహాలక్ష్మికి సోమవారం వినతి పత్రం అందిజేశారు. ఈ సందర్భంగా శివకుమారి మాట్లాడుతూ.. ముక్కెర బజార్‌లో నివసిస్తున్న హుస్సేన్ ఇంటి వరకు సీసీ రోడ్డు మంజూరు కాగా సీసీ రోడ్డు పొడవు తగ్గించి పోశారని తెలిపారు. వడ్డకుంట హుస్సేన్, తూర్పాక కృష్ణవేణి, లక్ష్మి, ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

శివాలయ వార్షికోత్సవం

ములకలపల్లి: మండల కేంద్రంలోని ఉమాపృథ్వీ రామలింగేశ్వర స్వామి వారి ద్వితీయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. రాత్రి పూట శివపార్వతి దేవతా మూర్తుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ములకలపల్లికి చెందిన గాదె తిరుపతిరెడ్డిగారి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కమిటీ అధ్యక్షుడు నరాటి ప్రసాద్, కోడుమూరు వీరగోపాల్, పువ్వాళ లలితారావు, గాదె సత్యనారాయణరెడ్డి, అనుముల సాయి, రమేష్ పాల్గొన్నారు.

ఆదివాసీలనే నియమించాలి

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం వద్ద ఉన్న చిలకలగండి ముత్యాలమ్మ తల్లి ఆలయానికి గిరిజన, పెసా చట్ట ప్రకారం ఆదివాసీలనే ఆలయ చైర్మన్‌గా నియమించాలని ఆదివాసీ గిరిజన సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు పాయం దుర్గారావు కోరారు. ఈ మేరకు సోమవారం సంఘం బాధ్యులు జిల్లా కలెక్టర్ ప్రియాంక అలను కలిసి వినతి పత్రాన్ని అందించారు.

రైతులను ఆదుకోవాలి

అశ్వాపురం: అకాల వర్షంతో నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని బీఆర్‌ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు గద్దల రామకృష్ణ డిమాండ్ చేశారు. అశ్వాపురంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. యువజన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శిథిలావస్థలో వెంగళరాయసాగర్

- అలుగుకు గండి పడి నాలుగేళ్లు
- నేటికీ మరమ్మతులకు నోచుకోని వైనం
- సీఎం పేషీలోనే నిధుల మంజూరు ఫైల్



గండి ద్వారా వృథాగా పోతున్న వరద (ఫైల్)



అలుగుకు పడిన గండి ఇదే..

చంద్రుగొండ: చంద్రుగొండ మండలం దామరచర్ల– సీతాయిగూడెం గ్రామాల మధ్య ఉన్న వెంగళరాయసాగర్ మండలంలోని పెద్ద సాగునీటి వనరు. మండలంలో సగం మాగాణి భూములను సస్యశ్యామలం చేసే ఈ ప్రాజెక్ట్ అలుగుకు నాలుగేళ్లక్రితం 2020 జులై నెలలో గండిపడింది. అప్పట్లో తాత్కాలిక మరమ్మతులు చేశారు. నెలరోజుల్లోనే మళ్ళీ తుఫాన్ వరదకు తాత్కాలికంగా చేసిన మరమ్మతు పనులు కొట్టుకుపోయాయి. ఈ క్రమంలో అప్పటి కలెక్టర్ డాక్టర్ ఎంవీ రెడ్డి ఆదేశాల మేరకు నీటి పారుదల శాఖాధికారులు డైవర్షన్ కాలువ నిర్మాణం చేశారు. దీంతో వర్షాలు పడినప్పటికి ప్రాజెక్ట్‌లో సగం నీరు వృథాగా పోతున్నాయి. దీంతో సగం ఆయకట్టుకు నీళ్లందడం లేదని రైతులు వాపోతున్నారు.

2 వేల ఎకరాల ఆయకట్టు..

వెంగళరాయ ప్రాజెక్ట్‌ను దివంగత ముఖ్యమంత్రి జలగం వెంగళరావు హయాంలో నిర్మించారు. ఈ ప్రాజెక్టు కింద 2,200 ఎకరాలు ఆయకట్టు ఉండగా.. సుమారు 600 మంది రైతులు దీనిపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారు. 100 యంసీఎఫ్‌టీల నీటి నిల్వ సామర్థ్యమున్న ఈ ప్రాజెక్టు పరిధిలో చంద్రుగొండ, సీతాయిగూడెం, దామరచర్ల, అయన్నపాలెం, ఇమ్మడి రామయ్యబంజర్, ఇందిరానగర్, మహ్మద్‌నగర్, తిప్పనపల్లి గ్రామాలున్నాయి. ప్రస్తుతం ఇది మరమ్మతులకు నోచుకోక పోవడంతో ఈ మేరకు రైతులు సాగునీటి కొరతను ఎదుర్కొంటున్నారు.

ప్రతిపాదనల తీరిదీ..

- 2017లో హైదరాబాద్ నుంచి సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ (సీడీఓ) అధికారుల బృందం ప్రాజెక్ట్‌ను సందర్శించింది.
- ప్రాజెక్ట్‌ను మరింత అభివృద్ధి చేయాలని సీడీఓ బృందం ప్రభుత్వానికి ప్రతిపాదన చేసింది.
- 2018 ఏడాది అలుగును బలోపేతం చేసేందుకు రూ.12.79 కోట్లు నిధులు అవసరమని నీటిపారుదల శాఖాధికారులు ప్రతిపాదనలను ప్రభుత్వానికి నివేదించారు.
- 2019 ఏడాది రూ.12.79 కోట్లు నిధులు మంజూరు కాగా, పెరిగిన మార్కెట్ రేట్లతో సదరు పనులు చేయలేమని కాంట్రాక్టర్ పనికి సంబంధించి క్యాన్సిలేషన్ లెటర్‌ను ప్రభుత్వానికి పంపించారు.
- 2020లో కురిసిన భారీ వర్షాలకు అలుగుకు గండి పడింది.
- 2020లోని అప్పటి కలక్టర్ డాక్టర్ యంవి.రెడ్డి ప్రాజెక్ట్ అలుగుకు పడిన గండిని పరిశీలించి శాశ్విత మరమ్మతులకు ప్రభుత్వానికి నివేదిక ఇస్తామన్నారు.
- 2021 ఏడాది ఆగస్టు 13న, ప్రాజెక్ట్‌ను సందర్శించిన అప్పటి కలక్టర్ అనుదీప్ దురిశెట్టి.. రైతులు అధైర్య పడొద్దని, త్వరలోనే శాశ్వత పనులు చేయిస్తామన్నారు.
- ప్రస్తుతం ఆ కలెక్టర్ ట్రాన్స్‌ఫర్ అవడంతోపాటు ప్రభుత్వం కూడా మారింది. ప్రస్తుతం ప్రాజెక్టు ప్రతిపాధనలు నూతన కాంగ్రెస్ ప్రభుత్వం చేతిలో ఉన్నాయి.

కొత్త ప్రభుత్వంలో కదలిక

కొత్తగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత వెంగళరాయసాగర్ మరమ్మతుల ఫైల్‌కు కదలిక వచ్చినట్లు అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది. ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు ఈ ప్రాంత రైతులు ప్రాజెక్ట్ పరిస్థితిని వివరించారు. ఈ క్రమంలో నూతనంగా నీటిపారుదల శాఖాధికారులు ప్రాజెక్ట్ అలుగు పనులకు జరిపించేందుకు రూ.32 కోట్ల నిధుల కోసం ప్రతిపాదనలు చేశారు. ప్రభుత్వ ఫైనాన్స్ డిపార్ట్‌మెంటులో ప్రాజెక్ట్ ఫైల్ పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. నిధులు మంజూరైతే అలుగు, రిటర్నింగ్‌వాల్ నిర్మాణం చేయాల్సి ఉంటుంది.

మంజూరు కాగానే ప్రారంభిస్తాం..

నిధుల కోసం ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాం. 220 మీటర్లు పొడవు, 6 మీటర్లు ఎత్తులో అలుగు నిర్మాణం చేయాల్సి ఉంది. ప్రస్తుతం ఎన్నికల కోడ్ దృష్ట్యా, నిధుల మంజూరీలో జాప్యం జరుగుతోంది. ఎన్నికల అనంతరం నిధులు రాగానే పనులు ప్రారంభిస్తాం.

– సురేష్‌కుమార్, జలవనరులశాఖ ఈఈ, అశ్వారావుపేట డివిజన్

అలుగు నాశనమవుతోంది..



అలుగు గండి పడినప్పటికి శాశ్విత పనులు చేయకపోవడం విచారకరం. ఫలితంగా ప్రతి ఏడాది వరద ఉధృతికి అలుగు మరింత కొట్టుకుపోయి నాశనమైపోతోంది. తాత్కాలికంగా చేసిన మరమ్మతు పనుల బిల్లులు సైతం ఇంకా రాలేదు.

– కీసరి భద్రయ్య, మాజీ సర్పంచ్, సీతాయిగూడెం

నీరు అందడం లేదు



అలుగుకు గండి పడటంతో ప్రాజెక్ట్‌లో నీళ్ల నిల్వ ఉండటం లేదు. కనీసం మధ్యలో ఉన్న పంటపొలాలకు నీరు రావడం లేదు. దీంతో రైతులు నష్టపోతున్నారు. నాలుగేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొంది.

– చిన్నం రామకృష్ణ, ఆయకట్టు రైతు, సీతాయిగూడెం

నిధులు మంజూరు చేయాలి



ప్రాజెక్ట్ మరమ్మతుల బారిన పడి ఏళ్లు గడుస్తున్నా నిధులు మంజూరు చేయకపోవడం బాధాకరం. రైతులు ఇబ్బందులు పడ్తున్నా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇప్పటికైన ప్రభుత్వం సత్వరమే స్పందించి నిధులు మంజూరు చేయాలి.

– ఇరప లక్ష్మీపతి, మాజీ సర్పంచ్, దామరచర్ల

గాలివాన నష్టం పరిశీలన



కరకగూడెం: వృద్ధురాలికి బియ్యం అందజేస్తున్న అధికారులు

కరకగూడెం: పినపాక మండలంలోని పలు గ్రామాల్లో డివిజనల్ డీఎల్పీఓ సుధీర్ కుమార్ సోమవారం విస్తృతంగా పర్యటించి గాలి వానకు దెబ్బతిన్న ఇళ్లను, పరిసరాలను పరిశీలించారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు బియ్యం నిత్యవసర వస్తువులు పంపిణీ చేశారు. అంతేకాకుండా పాండురంగాపురం పంచాయతీలోని ఇప్పలగుంపు గ్రామానికి చెందిన ఎట్టి సమ్మయ్యకు చెందిన ఇంటిపై ఆదివారం కురిసిన గాలివానకు తాటిచెట్టు కూలి గాయాలవ్వగా బాధితుడిని కలిసి పరామర్శించారు. అధైర్య పడొద్దని అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ సూర్యనారాయణ, మండల పంచాయతీ అధికారి వెంకటేశ్వరావు, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ బాలకృష్ణ జూనియర్ అసిస్టెంట్ రోశయ్య స్థానిక పంచాయతీ కార్యదర్శులు అశోక్ జైపాల్ రెడ్డి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన..

గాలి వాన బీభత్సానికి మండలంలోని పలు గ్రామాల్లోని వివిధ పంటలు నెలవాలయి. దీంతో అన్నదాతలు తీవ్ర నైరాశ్యంలో మునిగారు. ఈ క్రమంలో సోమవారం మండలంలోని అనంతారం, పద్మాపురం, చొప్పలా, తుమ్మలగూడెం తదితర గ్రామాల్లో మణుగూరు ఏడీఏ తాతారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో సుమారు 70 ఎకరాల్లో అకాల వర్షానికి పంటలకు నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు.అంతేకాకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే దెబ్బతిన్న పంట వివరాలను ఉన్నత అధికారులకు నివేదిక పంపనున్నట్లు తెలిపారు. రైతులకు సహాయం అందేవిధంగా కృషి చేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఓ చటర్జీ, ఏఈఓలు అనిల్, ప్రశాంత్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: అకాల గాలి వానతో దెబ్బతిన్న వరి పంటలను అశ్వారావుపేట వ్యవసాయ శాఖ అధికారి నవీన్ పరిశీలించారు. సోమవారం మండలంలోని గుమ్మడవల్లి, కొత్తూరు, వడ్డెర రంగాపురం గ్రామాల్లో పర్యటించి రైతులు సాగు చేస్తున్న వరి పంట పొలాలను సందర్శించి గాలి దుమారంతో నేల వాలిన వరి పంటను పరిశీలించి వివరాలను తెలుసుకున్నారు. కాగా గుమ్మడవల్లి గ్రామంలోనే 15 ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. అదే విధంగా వడ్డెర రంగాపురంలో ఓ రైతుకు చెందిన వరి ధాన్యం బస్తాలు అకాల వర్షంతో తడిసిపోవడంతో వీటిని కూడా ఏఓ పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఏఈఓ షాకిరా భాను, రైతులు ఉన్నారు.

బీజేపీ ఎన్నికల ప్రచారం

అశ్వారావుపేటరూరల్: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందాలంటే బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షులు బండారు చంద్రశేఖర్ అన్నారు. సోమవారం పార్టీ ఆధ్వర్యంలో అశ్వారావుపేటలోని నందమూరికాలనీ, డ్రైవర్స్ కాలనీ, పోస్టు ఆఫీసు రోడ్, బస్టాండ్ సెంటర్ తోపాటు పలు ప్రాంతాల్లో ఖమ్మం పార్లమెంట్ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తాండ్ర వినోదరావుకు ఓటు వేసి గెలిపించాలని ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాలను గడపగడపకు వెళ్లి వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎస్‌వీటీ కొండ, జల్లిపల్లి అరవింద్, కలకోటి కృష్ణ, చిట్టి శ్రావణ్, కాకి రాము, శ్యాం, వినోద్ పాల్గొన్నారు.

దమ్మపేట: భారతీయ జనతా పార్టీకి ఓటేయాలని కోరుతూ మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సోమవారం మండలంలోని ముష్టిబండ గ్రామంలో, బీజేపీ జిల్లా నాయకుడు ఉడతనేని విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీజేపీ కార్యకర్తలతో కలసి గడప గడపకు తిరుగుతూ, గోడ పత్రాలను అంటిస్తూ, ఓటర్లకు కరపత్రాలను పంచారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరావు మాట్లాడుతూ... కమలం గుర్తుకు ఓటేసి, ఖమ్మం బీజేపీ పార్లమెంటు అభ్యర్థి తాండ్ర వినోద్‌రావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మడకం రవి, సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

అశ్వారావుపేటరూరల్: ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థిగా బరిలో ఉన్న బీఆర్‌ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు గెలుపే లక్ష్యంగా పని చేయాలని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకు అశ్వారావుపేట ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని ఊట్లపల్లి, వినాయకపురం, ఆసుపాక, నందిపాడు, వడ్డెర రంగాపురం, గుమ్మడవల్లి, బచ్చువారిగూడెం గ్రామ పంచాయతీల్లో పార్టీ ముఖ్య నాయకులతో సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మందపాటి మోహన్‌రెడ్డి, యూఎస్ ప్రకాశ్‌రావు, బిర్రం వెంకటేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ జేకేవీ రమణారావు, జుజ్జూరి వెంకన్న, డాక్టర్ బి.ప్రసాద్, వగ్గెల పూజ, సాంబశివరావు, బిర్రం ఉదయ్ పాల్గొన్నారు.

గాలిదుమారంతో వీధినపడిన కుటుంబం

చంద్రుగొండ: గాలిదుమారం ఓ కుటుంబాన్ని వీధిన పడేసింది. మండలంలోని తిప్పనపల్లి గ్రామంలో అబ్దుల్ నబీ అనే చిరువ్యాపారి ఇంటిపై గాలిదుమారానికి ఆదివారం రాత్రి వేపచెట్టు కూకటి వేర్లతో కూలిపడింది. దీంతో అబ్దుల్ నబీకి చెందిన రేకులఇల్లు పూర్తిగా ధ్వంసం అయింది. రేకులు పూర్తిగా పగిలాయి. ఇంటిగోడలు బీటలు వారాయి. ఇంట్లో సామాన్లు దెబ్బతిన్నాయి. పెద్దశబ్దంతో వేప చెట్టు ఇంటిపై పడటంతో ఇంట్లోనే ఉన్న అబ్దుల్‌నబీ భార్య, ముగ్గురు పిల్లలతో ఒక్కసారిగా బయటకు వచ్చారు. ఏం జరిగిందో తెలిసేలోపే ఇల్లంతా నశనమైంది. చిరువ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించే అబ్దుల్‌నబీ భార్యపిల్లలతో రోడ్డున పడ్డాడు. ప్రభుత్వం పేద కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ముగిసిన కంటి వైద్య శిబిరాలు



విద్యార్థినులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

మణుగూరురూరల్: గత వారం రోజులుగా మణుగూరు సబ్ డివిజన్‌లోని మణుగూరు, పినపాక, కరకగూడెం, అశ్వాపురం మండలాల్లోని ప్రభుత్వ హాస్టళ్లల్లో నిర్వహించిన కంటి వైద్యశిబిరాలు సోమవారంతో విజయవంతంగా ముగిశాయి. ఆయా మండలాల్లోని 15 ఎస్సీ, ఎస్టీ, బీసి హాస్టళ్లల్లో సుమారు 2,599 మంది విద్యార్థినీ, విద్యార్థులకు కంటి వైద్యపరీక్షలు చేసినట్లు ఆర్‌బీఎస్‌కే మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గోపిలాల్, నేత్ర వైద్యాధికారి జి.సంజీవరావులు తెలిపారు. వీరిలో 90మంది విద్యార్థులకు కళ్లజోళ్లు అవసర మని నిర్ధారించడంతో పాటు 12మందిని మెరుగైన వైద్యం కోసం రిఫర్ చేసినట్లు వారు తెలిపారు. వేసవి సెలవులు ముగిసిన తర్వాత విద్యార్థులకు కళ్లజోళ్లను పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. కంటి చూపు సమస్యతో బాధపడుతున్న వారు ప్రతీ సోమ, బుధ,శుక్ర వారాలలో మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో, మంగళవారం, శనివారం శివలింగాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, పినపాక, జానంపేట, కరకగూడెం మండలాల ప్రజలకు గురువారం పినపాక పాథమిక ఆరోగ్య కేంద్రంలో కంటి వైద్య పరీక్షలు చేస్తున్నట్లు నేత్ర వైద్యాధికారి సంజీవరావు తెలిపారు. బాధితులు ఆయా కేంద్రాల్లో వైద్యపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే ఫార్మసిస్ట్ సరస్వతి, ఏఎన్‌ఎం పుష్ప, డ్రైవర్ వెంకటేశ్వర్లు, హాస్టళ్ల ప్రిన్సిపల్స్, వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు.

పోడు సమస్యను పరిష్కరించాలి



ఐటీడీఏ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఆదివాసీలు

భద్రాచలంటౌన్: భద్రాచలం డివిజన్‌లో నెలకొన్న పోడు భూముల సమస్యనుల పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని గోండ్వాన సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల ప్రజలు సోమవారం భద్రాచలం ఐటీడీఏ ముందు నిరసన వ్యక్తం చేసి అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ మాట్లాడుతూ.. చర్ల, దుమ్ముగూడెం మండలాలలో గత 15 ఏళ్లుగా ఆదివాసులు సాగు చేస్తున్న పోడు భూముల సమస్య తీవ్రంగా ఉందన్నారు. ఈ ప్రాంతానికి చెందిన ఆదివాసీ గిరిజనులు పోడు భూల విషయంలో సుమారు 14 మందిపై అటవీ శాఖ అధికారులు కేసులు నమోదు చేయడంతో జైలు పాలయ్యారని పేర్కొన్నారు. ఇప్పటికైా అధికారులు స్పందించి పైసా చట్టం ప్రకారం గ్రామ సభలు నిర్వహించి అర్హులైన ఆదివాసీ గిరిజనులకు పోడు పట్టాలు అందజేయాలని వారు కోరారు. కార్యక్రమంలో పాయం సన్యాసి, మడకం భూదేవి, తెల్లం వరలక్ష్మి, వర్ష సునీత, కొర్సా రమాదేవి, పాయం చిన్నక్క, పాయం నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలి పెంచాలి..

దమ్మపేట: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు కొలతలు లేకుండా బేషరతుగా రోజుకు సగటున రూ.600లను వేతనంగా ఇవ్వాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్లపూడి రాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని రెడ్యాలపాడు గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలను కలిసిన అమర్లపూడి రాము.. వారితో సమస్యలపై మాట్లాడారు. పనులు చేస్తున్న ప్రదేశంలో టెంట్, మెడికల్ కిట్లు, ఓఆర్‌ఎస్, మజ్జిగ, తాగునీరు తదితర అత్యవసర వసతులను కల్పించాలని డిమాండ్ చేశారు.

మాస్‌లైన్ ఆవిర్భావ వేడుకలు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ఆశోక్‌నగర్ కాలనీలోపి సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ కార్యాలయంలో ఆ పార్టీ ఆవిర్భావ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కెచ్చల రంగారెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కమ్యూనిస్టుల ఉద్యమంలో ఏప్రిల్ 22 చారిత్మకమైన రోజు అన్ని నిజాం పాలన నుంచి విప్లవ కారులు వేరుపడిన దినమని గుర్తు చేశారు. కార్యక్రమంలో కెచ్చెల కల్పన, శివకుమార్, మహేశ్వరి, కుమారి, శాంతక్క, రమాదేవి, నాగరత్నం, రేవతి, వరలక్ష్మి, జయమ్మ, చిన్నతల్లి తదితరులు పాల్గొన్నారు.

పతాక ఆవిష్కరణ..

దమ్మపేట: సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని, మండలంలోని లింగాలపల్లి, గండుగులపల్లి, దమ్మపేట గ్రామాల్లో ఆ పార్టీ అరుణ పతాక ఆవిష్కరణ కార్యక్రమాలను నిర్వహించారు. నాయకులు కుర్సం ముత్యాలరావు, బండి ఆదినారాయణ, పందూరి వీరబాబు, కీసరి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోత

దమ్మపేట: మండలంలోని మల్కారం సబ్‌స్టేషన్ పరిధిలోని వినియోగదారులకు నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునని ఏడీఈ వెంకటేశ్వర్లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మల్కారం సబ్‌స్టేషన్ పరిధిలోని గుత్తావారిగూడెం 11 కేవీ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా నేడు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. రైతులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ట్రాఫిక్‌కు అంతరాయం

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని గోదావరి బ్రిడ్జిపై సోమవారం సాయంత్రం ఏపీకి చెందిన ఆర్టీసీ బస్సు మరమ్మతులకు గురికావడం దాదాపు అరగంట పాటు బ్రిడ్జికి ఇరువైపు వాహనాలు రావాణాకు అంతరాయం కలిగింది. ఈ క్రమంలో ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రణ చర్యలు చేపట్టారు. అనంతరం భద్రాచలం ఆర్టీసీ డిపో అధికారులు ప్రత్యామ్నాయ చర్యల్లో భాగంగా ప్రయాణికులను మరో బస్సులో గమ్య స్థానానికి తరలించే విధంగా ఏర్పాట్లు చేశారు.

సేవాదళ్ ఇన్‌చార్జ్‌గా కొదుమూరి

చంద్రుగొండ: కాంగ్రెస్ సేవాదళ్ ఖమ్మం పార్లమెంటరీ ఎన్నికల ఇన్‌ఛార్జ్‌గా కొదుమూరి దయాకర్‌రావు నియమితులయ్యారు. హైదరాబాదులో సోమవారం నిర్వహించిన సేవాదళ్ రాష్ట్ర కమిటీ సమావేశంలో తనపై పార్టీ పెద్దలు ఉంచిన బాధ్యతను సక్రమంగా నిర్వహించి అభ్యర్థి గెలుపుకోసం కృషి చేస్తానని ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తనకు బాధ్యతలు అప్పగించిన జాతీయ కార్యదర్శి తొగాడియా, రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల జితేంద్రలకు కృతజ్ఞతలు తెలిపారు.

లెనిన్ జయంతి..

బూర్గంపాడు: రష్యా బోల్షెవిక్ పార్టీ వ్యవస్థాపకుడు లెనిన్ జయంతిని సోమవారం సీపీఎం మండల కార్యాలయంలో నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లెనిన్ చిత్రపటానికి పార్టీ మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు పూలమాల వేసి నివాళ్లర్పించి మాట్లాడుతూ.. ఉత్పత్తి సాధనాలను ప్రైవేట్ పెట్టుబడిదారుల చేతుల నుంచి తప్పించడం, మార్కెట్ వ్యవస్థను పూర్తిగా రద్దు చేయడం ద్వారా మాత్రమే కార్మిక కర్షక రాజ్యం స్థాపించడం సాధ్యమవుతుందని, తద్వారా సోషలిజానికి మార్గం ఏర్పడుతుందని లెనిన్ నిరూపించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు భయ్యా రాము బర్ల తిరపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధానికి కృషి చేయాలి



మిట్టగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

అశ్వాపురం: ప్లాస్టిక్ నిషేధించి కాలుష్య నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గురుకుల బాలుర డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ స్వప్నకుమారి సూచించారు. మండల పరిధిలోని మిట్టగూడెంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర డిగ్రీ కళాశాలలో సోమవారం ప్రపంచ ధరిత్రి దినోత్సవం నిర్వహించారు. బాలురు కళాశాల నుంచి మిట్టగూడెం వరకు ర్యాలీ నిర్వహించి ప్లాస్టిక్ వాడడం నిషేధించాలి.. కాలుష్యాన్ని నిర్మూలించాలి.. మొక్కలు నాటి సంరక్షించాలి.. అడవుల దహనం అరికట్టాలంటూ నినదిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, బోటనీ విభాగం అధ్యాపకురాలు అపర్ణ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మనిషా పాల్గొన్నారు.

ఓటు హక్కుపై ప్రచారం

అశ్వారావుపేట: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓటు హక్కు ప్రాధాన్యత, పోలింగ్ వివరాల గురించి ప్రభుత్వ కార్యాలయాల గోడలపై సోమవారం వాల్ రైటింగ్స్ రాయించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాలు, ప్రహరీపై ఓటు హక్కు వినియోగం, బాధ్యత, భవిష్యత్, నా ఓటు–నా హక్కు నినాదాలతో ఓటర్లను అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు.


చదువులో ప్రతిభ కనబర్చాలి

మణుగూరురూరల్: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుల్లో చక్కటి ప్రతిభ కనబర్చాలని మణుగూరు ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ కోర్ట్ మెజిస్ట్రేట్ ఎం.వెంకటేశ్వర్లు సూచించారు. మండలంలోని సీటైప్ ప్రాంతంలోని ఎక్స్‌లెంట్ హైస్కూల్‌లో సోమవారం గ్రాడ్యుయేషన్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మణుగూరు మెజిస్ట్రేట్ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై మూడు, నాలుగు, ఐదో ఒలంపియాడ్ స్టార్ తరగతులకు విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎక్స్‌లెంట్ విద్యాసంస్థల చైర్మన్ ఎండి.యూసఫ్ షరీఫ్, కరస్పాండెంట్ ఎండి.ఖాదర్, డైరెక్టర్ యాకుబ్ షరీఫ్, ప్రైమరీ ప్రిన్సిపల్ సమియా నయ్యర్, ఉపాధ్యాయురాలు జీనత్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ దేవి విగ్రహావిష్కరణ

మణుగూరుటౌన్: వాసవీ క్లబ్, వాసవీ వనితా వైభవం ఆధ్వర్యంలో కేసీజీఎఫ్ దోసపాటి వెంకటేశ్వరరావు మండలంలోని కూనవరం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సరస్వతి దేవి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విగ్రహాన్ని దోసపాటి రంగారావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పాఠశాల హెచ్‌ఎం మీరాహుస్సేన్ వాసవీక్లబ్ ప్రతినిధులను ఘనంగా సన్మానించారు. క్లబ్ ప్రతినిధులు బండారు నర్సింహారావు, బొగ్గవరపు అంజలి, జోన్ చైర్మన్ చిట్టూరి శేషుబాబు, నాగరత్నమణి, చిత్తలూరి రమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై పట్టింపేది?



మాట్లాడుతున్న మచ్చా వెంకటేశ్వర్లు

చర్ల: కోట్ల రూపాయల విలువ చేసేగోదావరి ఇసుక కొంత మందికే కల్పవృక్షంగా మారిందని, ఇసుక అక్రమరవాణాపై నూతన ప్రభుత్వానికి పట్టింపు లేదని సీపీఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం చర్లలోని బీఎస్ రామయ్య భవన్‌లో పార్టీ సీనియర్ నాయకులు కారం నరేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజనల మధ్యకు రైజింగ్ కాంట్రాక్టర్ల పేరుతో చేరుతున్న బినామీ కాంట్రాక్టర్లు గిరిజనులకు ఉపాధి లేకుండా.. చేస్తూ పెద్ద ఎత్తున యంత్రాలను గోదావరి నదిలోకి దించి టిప్పర్లతో ఇసుకను నేరుగా తరలిస్తున్నారని అన్నారు. దీనివల్ల ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. ఆదివాసీలకు జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టేందుకు జిల్లా కలెక్టర్ దృష్టి సారించాలని ఆయన డిమాండ్ చేశారు. లేదంటే ఇసుక క్వారీలు నిర్వహిస్తున్న ప్రాంతాల్లోని మహిళలందరినీ సమీకరించి కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు బ్రహ్మచారి, మండల కార్యదర్శి మచ్చా రామారావు, మండల కమిటీ సభ్యులు సమ్మక్క, వెంకట్, హరినాగవర్మ, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.